


# మాయరోగం

టి. శ్రీనివాసరావు ఎం. బి. బి. ఎస్ డిగ్రీ సంపాదించి రెండుసంవత్సరాలైనా వెళ్ళకపూర్వమే వైద్య వృత్తిని మనసార నిరసించటం మొదలుపెట్టాడు. మనిషి కీడెంచితే భగవంతుడు మేలెంచటం కొంచెం విరుద్ధంగా తోచిందతనికి. అతనికి సంపాదన తప్పనిసరి కాదు. పదిహేను వీసాలు సరదాగా కొన్నిసంవత్సరాలు మెడికల్ విద్యార్థి జీవితం గడపవచ్చును కదా అని డాక్టరుచదువు చదివాడు. కోర్సు ప్రారంభించగానే తెలిసొచ్చింది యూనివర్సిటీవాళ్ళు తనచేత వెట్టిచాకిరి చేయించదలిచారని. శ్రీనివాసరావు మొండెత్తు వేసి ఇంటిదగ్గిర పుస్తకం ముట్టుకున్నపాపాన పోకుండా జరిపాడు. సంవత్సరాంతాన పాసయినాడు. కోర్సంతా ఆవిధంగానే గడిచింది. తప్పేవాళ్ళంచేసి తప్పుతారో అతనికి అర్థంకాలేదు.

ప్రాక్టీసు కూడా ఎవరూ తనదగ్గిరికి రారుకదా, పది పదిహేనేళ్ళనించీ తన తోటిడాక్టర్లు ప్రాక్టీసు లేకుండా అవస్థపడుతుంటే తనకెక్కణ్ణించి వస్తుంది కనక, అనుకుని చెక్కగొట్టి నాలుగునెలలు కాలేదు, అప్పుడే అతని క్లయింట్లు లిస్టు నూరు దాటింది, అతని వర్కింగవర్సు రోజుకు పన్నెండుగంటలపైనై, అతని సంపాదన నెలకు నూటయాభైలో పడ్డది! వెధవజీవితమనుకున్నాడు శ్రీనివాసరావు. అతనికి డబ్బునుచూస్తే అసహ్యమనీ, పేరుప్రతిష్టలు చేదనీకాదు, అంత బద్ధకస్తుడు పుట్టబోడు, పెరగబోడు.

శ్రీనివాసరావు నిట్టూర్పువిడిచి లేచాడు. చేతినున్న గడియారం చూశాడు. ఆరూపది! సినీమాకైనా పోవచ్చు. ఏంటకుకు? లేచింది మొదలు రోగులు, రోగులు, రోగులు! విసుగూ విరామం లేకుండా— రోగులు! అందరికన్నా క్షమించటానికి వీల్లేందెవర్నంటే- రోగుల్ని! ఛత్!

'కాంపౌండర్!'

'చిత్తాం!'

'నేనలా పార్కువైపు వెడుతున్నాను! ఏడయ్యేదాకా ఉండి నువ్వుకూడా వెళ్ళిపో!'

మళ్ళీ శర్మగారింజక్షన్ కోసరం వస్తారేమో!'

'ఆయన విషయం చిత్రంగా ఉందోయ్, మరీనూ! ఇప్పటికే రెండనవసరంగా పుచ్చుకున్నాడు. గట్టిగా చెబితే ఈ డాక్టరుత్తిచవట నాగమ్మఅని ఊరంతా చాటి పారేస్తాడని భయం! అ? మరేం, మళ్ళీ పాయింట్రీ ఇవ్వు—మెల్లిగా చెప్పిచూసి వినకపోతే!'

కాంపౌండరు అట్లాగేనని తలఊపుతూ నవ్వాడు.

'ఆయనకు ఇంజక్షన్లు మంచి గుణమిస్తున్నాయటండి!' అన్నాడతను.

'సరే! ... నేనలా పోయివస్తాను!'

'చిత్తాం!'

డాక్టరు శ్రీనివాసరావు వెళ్ళే ప్రయత్నంలో ఉండగా ఒకకుర్రవాడు అనుమానిస్తూ లోపలికి ప్రవేశించి అతనికి నమస్కారంచేశాడు.

'ఎవరికోసరం?'

'డాక్టరుగారు లేరండి?'

'నేనే డాక్టర్ని.'

'మీతో ఒకమాటమాట్లాడి పోదామని వచ్చానండి.'

'ఇప్పుడుకాదు. ఇప్పుడు నాకు చాలా జరూరుపని ఉంది. రేపొద్దున ఏడు దాటాక రా!'

'అప్పుడు నాకు వీలుపడదండి. రేపురమ్మంటే వస్తానుకాని మళ్ళీ ఈవేళకే వస్తాను.'

శ్రీనివాసరావు ఆ కుర్రవాడి అహంకారానికి మండిపడ్డాడు. 'మరి నాకీ వేళప్పుడెన్నడూ తీరదూ!' అన్నాడు.

'కానివ్వండి. మరో డాక్టరు దగ్గిరికి పోతాను.' ఆ కుర్రవాడు దీనంగా వెనక్కి తిరిగాడు. శ్రీనివాసరావుకు జాలేసింది. ఆకుర్రవాడి వీపు అతని హృదయాన్ని చిత్రంగా ద్రవించింది. ఇంతసేపున్నవాడింకో అయిదు నిమిషాలుంటే మునుకుపోయిందేమిటి? గడపదాకా వెళ్ళిన కుర్రవాణ్ణి వెనక్కి పిలిచాడు డాక్టరు.

'ఏమిటి నువ్వు చెప్పదలిచింది?' అన్నాడతను కుర్చీలో కూర్చుని.

'నేను చెప్పదలిచింది త్వరలో కాదేమోనండి!' అన్నాడు కుర్రవాడు అనుమానిస్తూ.

'ఇప్పటికి క్లుప్తంగా ముగించు. తరవాత రేపు వింటాను. సరేనా?'

'చిత్తం అలాగే కానివ్వండి. ఇంతకూ నాకు కావలిసిందేమంటే—నేను గతమంతా మరిచిపొయ్యేటట్టు చెయ్యగలరా?'

ఆ కుర్రవాడు తనతో పరాసికాలాడుతున్నాడని [illegible]

'పగలంతా ఇబ్బందిలేదండి. రాత్రి నిద్రపట్టదు. గడిచిన విషయాలన్నీ కళ్ళలో మెదులుతూంటాయి. [illegible] కేదైనా మందు—'

ఒకముక్కముక్కి డాక్టరు కుర్చీలోనించి లేస్తూ 'కాంపౌండర్! ఇతనికొక స్లీపింగ్ మిక్శ్చర్ ఇచ్చి పంపెయ్!' అన్నాడు.

'మీ బ్రోమైడ్స్‌తో పొయ్యేరోగం కాదండి ఇది' అన్నాడు కుర్రవాడు.

శ్రీనివాసరావు నిర్ఘాంతపోయినాడు. అంత కుర్రాడికి—పదేళ్ళయినా ఉంటయ్యో ఉండవో?—బ్రోమైడ్స్‌ను గురించి తెలుసునసేకాదు అతని ఆశ్చర్యం; అంతకన్న ఆశ్చర్యకరంగా ఉంది ఆకుర్రవాడి గొంతు. ఆకుర్రవాడి గొంతులోనించి అంత గంభీరమైన నాదం ఎట్లావచ్చింది?

'క్షమించండి. మీకు నేను నార్డరివ్వడానికి రాలేదు. కాని నారోగం సరిగా కనుక్కుంటే మీరు మంచి మందివ్వగలుగుతారని నా ఆశ. మీరు డాక్టర్లు. నేను మీకు చెప్పేదేమిటి? సగంచెప్పి సగం చెప్పక పోవటం నాకే హాని. అదీకాక నేను టూకీగా నా అవస్థ చెప్పాలని ప్రయత్నించేస్తే నామాటలు నమ్మరు. మాట వరసకు నేను గతం మరిచేటందుకు మందిమ్మన్నానను కోండి. ఇంత చిన్నవాడికి గతమేమిటూ అని మీరు నవ్వరా? నేను పుట్టిపెరిగిన ఈపది సంవత్సరాల్లో మరవదగినది ఏమంతలేదు కానీండి, అంతకు పూర్వం నడిచిందీ దాన్ని భరించలేను. అది నన్ను విడవకుండా ఉంది! నా గుండెమీద పెద్ద రాయల్లే ఉంది. ఆ రాయి ఎత్తేసిన పుణ్యాత్ముడికి కంతపుణ్యమున్నా ఉందండి!'

శ్రీనివాసరావు ఒక్కక్షణం నీళ్ళలో ఊపిరాడక తన్నుకున్నవాడల్లే మథనపడ్డాడు. చివరకతను బిగ్గరిగా 'ఆగు! నువ్వు చెప్పేది ఒక్కముక్క నాకర్థం కావటంలేదు. నీపేరేది?' అని అరిచాడు కాంపౌండరు అగురిపడేట్టు.

'నా పేరు సత్యం!'

'అలా ఒక్కో ప్రశ్నకే మెల్లిగా సమాధానంచెప్పు! నీ వయస్సెంత?'

'[illegible]దేళ్ళు.'

'లేదండి.'

'మీ వంశంలో ఎవరికైనా—ఎవరికైనా—కొంచెం మతి చాంచల్యం—అలాటిదేమైనా ఉందా?'

'అబ్బే! లేదండి.'

'నీకు తరుచు కలలు వస్తూండటం—మేలుకునుండే కలలు కంటం కద్దా?'

నాకు మతిచెడ్డదనే ఉద్దేశంతో మీరిలా ప్రశ్నిస్తే నే చెప్పదలిచిందెలా చెప్పడం?'

సరిగా ఈసమయానికి కాంపౌండరు లైటు తెచ్చి బల్లమీద పెట్టాడు. శ్రీనివాసరావు తన కెదురుగా నిలబడ్డ ఆకుర్రవాడి మొహం వంక చూశాడు. అనిదృష్టి

సరాసరి సత్యం కళ్ళమీదికి పోయింది. అతని శరీరం కంపించటం మొదలుపెట్టింది అవేం కళ్ళు? వాటిని చూస్తే తనశరీరం ఎందుకంత కంపిస్తుంది? కుర్రవాణ్ణి చూసి తనకెందుకంత ముచ్చెమటలు పొయ్యాలా?

సత్యంకూడా డాక్టరువంక ఆశ్చర్యపడుతూ చూడటం మొదలుపెట్టాడు.

'నేను మిమ్మల్ని కిందటిసారి చూసినప్పుడు మీ మొహం ఇంకోతీరుగా ఉంది! మీకు నన్ను వెనకెప్పుడైనా చూచిన జ్ఞాపకం ఉందాండి?'

'లేదు! లేదు! నిన్ను నేనెరగను. నువ్విక్కణ్ణించి వెళ్ళిపో! పో!' అని అరిచాడు శ్రీనివాసరావు.

కాంపౌండరు ఆదుర్దాగా ప్రవేశించాడు. కాని ఆ ఇద్దరిలో ఒకరుకూడా అతనివైపు తలతిప్పలేదు. అడివిలో అకస్మాత్తుగా ఎదురైన రెండు సమాన బలం గల క్రూరజంతువుల్లా ఒకరిమీదినించి ఒకరు చూపు తప్పించలేకుండా ఉన్నారు. ఇద్దరికీ మతిపోయిం దనుకున్నాడు కాంపౌండరు.

శ్రీనివాసరావుకూ సత్యానికీ ఒక్క భేదంమాత్రం ఉంది. శ్రీనివాసరావు సహజంగా మాట్లాడే స్థితిలో లేడు. అరిస్తే అరవటం లేకపోతే నోరు తెరవలేకపోవటం! సత్యం మన ప్రపంచకంలో లేకపోయినా మాట్లాడగలిగి ఉన్నాడు. ఆ గొంతుమాత్రం పెద్దగా లేకపోయినా అమానుషంగా ఉంది. కాంపౌండరు చూస్తుండగానే అతను డాక్టరువైపు వేలుచూపిస్తూ 'నువ్వారోజున దానికోసం మామూలుప్రకారం సూర్యాస్తమయమైన పదిగడియలకు ఇల్లు బయలుదేరావు రాజుగారి ఉప్పు తింటున్న నేను—దాన్నిచూస్తే నీకన్న లక్షరెట్లు మోహంగల నేను—నీవెంబడే వచ్చాను. దానింట్లోకి నువ్వు పోతుండగా నేను అసమర్థుడల్లే ఏమీ చెయ్యలేకపోయినాను. నువ్వు లోపలికిపోయి తలుపు వేసుకోగానే నేను కోనేట్లో దిగి మీ కిటికిదగ్గిరికి ఈదుకుంటూవచ్చి అంతా చూశాను. నా రక్తం ఉడికిపోయింది. నాకు ఏనుగకున్నంత బలంవచ్చింది. గట్టెక్కి తిరిగివచ్చి ఒక్కతాపుకు తలుపు పగలతన్ని లోపల ప్రవేశించి దాని చేతుల్లోఉన్న నిన్ను రాజాజ్ఞ అంటూ బాకుతో పొడిచాను. అది రాజాజ్ఞ కాదు! అబద్ధం ఆడాను—

అకస్మాత్తుగా శ్రీనివాసరావు పెద్ద పెడబొబ్బపెట్టి 'దుర్మార్గుడా! పాపఫలం అనుభవించు!' అంటూ తన వెనకాల కుర్చీతీసి గట్టిగా సత్యంనెత్తిన కొట్టాడు. ఉత్తరక్షణం అతనికి స్పృహ తప్పిపోయింది.

ఆ దెబ్బకు కుర్చీకోడువిరిగింది. కుర్రవాడు చెక్కు చెదరలేదు కాని అతనిలో మార్పు గమనించానంటాడు కాంపౌండరు. మాట్లాడుతున్నంతసేపూ ముప్ఫైఏళ్ళవాడల్లే కనపడ్డ సత్యం అకస్మాత్తుగా కుర్రవాడయినట్టయింది. అతను చప్పున చిన్నపిల్లవాడి కీచుగొంతుతో 'అరెరే! అదేమిటండీ! డాక్టరుగారలా పడిపోయారు!' అని అరిచాడు.

డాక్టరుకు గంటసేపటికి తెలివి వచ్చింది. అతని ధోరణిచూస్తే కుర్రవాడు తనతో ఏమీ చెప్పలేదంటాడు. తనకు పని జాస్తయి ఆరోగ్యం చెడి పైత్యం చేసి మూర్ఛవచ్చిందంటాడు. ఆ కుర్రవాణ్ణికూడా కదిలించి చూశాను. కాని అతనికి కిందటిజన్మ తాలూకు సంగతులేవీ జ్ఞాపకంఉన్నట్టు కనిపించదు. ఆరోజున అక్కడికెందుకొచ్చావంటే నిద్రపట్టటానికి మందుకోసరం వచ్చానని ఒప్పుకున్నాడు. డాక్టరు కుర్చీ తనమీద వెయ్యలేదంటాడు డాక్టరు పిచ్చివాడల్లే ప్రవర్తించటంకూడా గమనించానంటాడు. కాని అది పైత్యపుతెర యొక్క ఫలితమని డాక్టరే అంగీకరించాడు. ఆ పిల్లవాడు ఆశ్చర్యపడటంకూడా తనకు జ్ఞాపకం ఉన్నదంటాడు డాక్టరు. కాని తను డాక్టర్నుచూసి ఆశ్చర్యపడ్డట్టు కుర్రవాడే అంగీకరిస్తున్నాడు. కుర్చీకాలి సాక్ష్యంకూడా ఎందుకూ పనికిరాదు, డాక్టరు కుర్చీ ఎత్తి దూరంగా పారేసినమాట డాక్టరూ కుర్రాడూ కూడా ఒప్పుకుంటున్నారు కనక. ఇద్దరిలో ఒక్కరైనా దాపరికంకోసరం ప్రయత్నిస్తున్నవాళ్ళల్లే లేరు.

ఎటొచ్చీ కాంపౌండరు సాక్ష్యం ఒక్కటే ఉంది. అది ఎంతవరకు నమ్మతగ్గదో మీరే నిశ్చయించుకుంటారు గాక!

—కొడవటిగంటి. కుటుంబరావు.